కుండపోత వర్షం




కొలిమిగుండ్ల పోస్టాఫీస్ రోడ్డులో నీటిలో అవస్థలు పడుతున్న స్థానికులు, కాలనీలోకి నీళ్లు భారీగా చేరడంతో మునిగిన బైకులు

- ఉప్పొంగి ప్రవహించిన వాగులు, వంకలు
- కాలనీలు జలమయం
- చెరువులకు జలకళ
- 98 మి.మీ వర్షపాతం నమోదు

కొలిమిగుండ్ల: మండలం కుండపోత వర్షం కురిసింది. రెవెన్యూ అధికారుల లెక్కల ప్రకారం 98 మి.మీ వర్షపాతం నమోదైంది. కొలిమిగుండ్ల, నాయినపల్లె, పెట్నికోట, ఇటిక్యాల, కనకాద్రిపల్లె, అంకిరెడ్డిపల్లె, మదనంతపురం, తుమ్మలపెంట తదితర గ్రామాల్లోని వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. కొలిమిగుండ్ల పోస్టాఫీస్ రోడ్డులో వర్షపునీరు భారీగా చేరడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమీపంలోని లోతట్టు కాలనీల్లోకి పెద్ద ఎత్తున నీళ్లు చేరాయి. ప్రధాన రహదారిపై భారీగా నీళ్లు ప్రవహించాయి. పోలీస్ క్వార్టర్స్‌లోకి పెద్ద ఎత్తున నీళ్లు చేరడంతో పోలీస్ సిబ్బంది, కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడ్డారు. పలు కాలనీల్లో మోకాలి లోతున నీళ్లు చేరుకున్నాయి. కల్వటాల వద్ద వాగు ఉధృతంగా ప్రవహించడంతో తెల్లవారు జామున రాక పోకలు బంద్ అయ్యాయి. అబ్దుల్లాపురం-కోర్నపల్లె గ్రామాల మధ్య మాల వంకకు పెద్ద ఎత్తున వర్షపు నీళ్లు రావడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వరదనీరు తగ్గుముఖం పట్టాక రాకపోకలు సాగాయి. మదనంతపురంలో వాగులు ఉప్పొంగడంతో నీళ్లు గ్రామంలోకి చేరాయి. అంకిరెడ్డిపల్లెలో పెద్ద ఎత్తున వాగు ప్రవహించింది. కొలిమిగుండ్ల-నాయినపల్లె మధ్యనున్న సద్దలవెంగన్న చెరువు, తిమ్మనాయినపేట, అబ్దుల్లాపురం దయ్యాల చెరువు, హనుమంతుగుండం చెరువులకు వరదనీరు భారీగా చేరడంతో జలకళ సంతరించుకుంది. మూడేళ్ల తర్వాత మండలంలో భారీ వర్షపాతం నమోదైనట్లు అన్నదాతలు తెలిపారు.



సంజామల-కానాల వద్ద రోడ్డుపై భారీగా ప్రవహిస్తున్న వర్షపు నీరు.

సంజామలలో 26.2 మి.మీ వర్షం

సంజామల: ఆకుమల్ల, కానాల, గిద్దలూరు, పేరుసోముల, రామిరెడ్డిపల్లె గ్రామాలలో భారీ వర్షం కురిసింది. మండలంలో 26.2 మి.మీ వర్షపాతం నమోదైందని వ్యవసాయ అధికారులు తెలిపారు. పంట పొలాల్లో వర్షపు నీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మొక్కజొన్న, మినుము తదితర పంటలకు స్వల్పంగా నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేరుసోముల గ్రామంలో ఉన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. సంజామల-కానాల గ్రామాల మధ్య ఉన్న గొంద్రవాగు ఉప్పొంగడతో కల్వర్టు మీద వర్షపు నీరు ప్రవహించడంతో ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. రామిరెడ్డిపల్లెలో భారీ వర్షంతో ఎస్సీ కాలనీ జలమయమైంది.



పేరుసోముల వాగు వద్ద వరద ఉధృతి

బనగానపల్లెలో..

బనగానపల్లె రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. బనగానపల్లె పట్టణంలో సాయంత్రం 6 నుంచి సుమారు గంట పాటు వర్షం కురవడంతో రోడ్లపైన, మురుగు కాల్వల్లో వర్షపు నీటితో నిండి పొంగి పొర్లాయి. ఈ వర్షం వరినాట్లకు ఉపయోగకరంగా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.



అబ్దుల్లాపురం - కోర్నపల్లె మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

కోవెలకుంట్లలో..



కోవెలకుంట్లలో వర్షం కురుస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: స్థానిక వ్యవసాయ సబ్‌డివిజన్‌లో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మేఘావృతమై రాత్రి కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల మండలాల్లో వర్షం పడింది. వివిధ కాలనీల ప్రధాన వీధుల్లో భారీగా వర్షపునీరు చేరింది. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం జలమయం కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఇటీవల కురుస్తున్న వర్షాలు ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు ఊరట నివ్వగా ఈ నెలలో సాగు చేయాల్సిన పంటలకు అనుకూలంగా మారటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వ్యవసాయ విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ అనంతరావు ఆదివారం తెలిపారు. అమడాల, గుంజలపాడు, జోళదరాశి, గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం, అల్లూరు, కొత్తపల్లె, కలుగొట్ల, కొప్పెర్ల, రేవనూరు ఫీడర్ల పరిధిలోని ఆయా గ్రామాల వ్యవసాయానికి ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు.

- **సంజామల:** మండల పరిధిలోని ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపూరి, ముదిగేడు, కానాల, అక్కంపల్లె, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, రామిరెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వ్యవసాయ విద్యుత్ సరఫరా ఉంటుందని ఇన్‌చార్జ్ ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : మండలంలోని దేవరబండ సబ్‌ స్టేషన్ పరిధిలో మిద్దెపల్లె ఫీడర్ కింద రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో 11 కేవీ పనులు జరుగుతున్న కారణంగా సోమ, మంగళవారాల్లో రెండు రోజుల పాటు ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ నాగేశ్వరరెడ్డి తెలిపారు. మిద్దెపల్లె, అనుంపల్లె, రేగులకుంట, దేవరబండ గ్రామాలకు ఉదయం 10 నుంచి సాయత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ రెండు రోజులు రైతులకు ఇచ్చే త్రీ ఫేజ్ కరెంటు తెల్లవారు జామున 3 నుంచి ఉదయం 10 గంటల వరకు మరలా సాయత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు ఇస్తామని పేర్కొన్నారు.

వాహనాల తనిఖీ

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల- నంద్యాల ఆర్అండ్‌బీ రహదారిలోని స్థానిక కుందూనది వై జంక్షన్ వద్ద ఆదివారం ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, జమ్మలమడుగు, తదితర ప్రాంతాల వైపు వెళ్లే వాహనాలను ఆపి రికార్డులు పరిశీలించారు. ఆర్సీ, లైసెన్స్, హెల్మెట్ తదితర రికార్డులు లేని వాహన చోదకులకు జరిమానా విధించారు.

క్లుప్తంగా

శాంతిభద్రతలకు విఘాతం కల్గించొద్దు



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ మల్లికార్జునరెడ్డి

కోవెలకుంట్ల: శాంతిభద్రతలకు విఘాతం కల్గించొద్దని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. రౌడీషీటర్ల కదలికలపై నిరంతర నిఘా ఉంటుందన్నారు. ప్రవర్తనలో మార్పు వచ్చినట్లు పోలీసులు భావిస్తే రౌడీషీట్లు ఎత్తివేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు మద్దిలేటిరెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శుభకార్యం



బనగానపల్లె రూరల్: స్థానిక జీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన ఉపాధ్యాయులు నరసింహారెడ్డి కుమారుడి వివాహ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, కోవెలకుంట్ల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బీవీ నాగార్జునరెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, నందిపైపుల రామచంద్రారెడ్డి ఉన్నారు.

శాంతియుత జీవనం గడపాలి



పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ

బేతంచెర్ల : రౌడీ షీటర్లు నేరాలకు దూరంగా ఉంటూ శాంతి యుత జీవనం గడపాలని సీఐ వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో మండలంలోని రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎవరైనా నాటుసారా, అక్రమ మద్యం విక్రయం, పేకాట, మట్కా నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కక్షలు, కార్పణ్యాలకు దూరంగా ఉండి గ్రామాల అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలన్నారు.

దుర్గా భవానికి ప్రత్యేక పూజలు

బనగానపల్లె రూరల్: మండలంలోని పలుకూరు గ్రామం తెలుగుపేటలో దుర్గా భవాని పీఠానికి గురువు షేక్షావలి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన భవాని భక్త బృందం బోనాలను ఆంజనేయస్వామి ఆలయం నుంచి తెలుగుపేటలోని పీఠం వరకు గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం బోనాలను అమ్మవారికి సమర్పించి పూజలు చేశారు.

ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకుందాం



మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు

డోన్ టౌన్ : ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడిపై ఉందని యూటీఎఫ్ రాష్ట్ర మాజీ గౌరవ అధ్యక్షుడు నరసింహులు, జిల్లా మాజీ గౌరవ అధ్యక్షుడు ఎస్ఎస్ బాబు, జిల్లా గౌరవ అధ్యక్షుడు సుబ్బరాయుడు అన్నారు. యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం పాత బస్టాండ్‌లోని సమైఖ్యాంధ్ర కట్ట వద్ద జెండా ఆవిష్కరణ చేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ అనుచిత నిర్ణయాల వల్ల ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి ప్రమాదంలో ఉందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ డోన్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మీనాయక్, గోపాల్, ప్యాపిలి, కృష్ణగిరి మండల అధ్యక్షులు రమేష్ నాయుడు, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

గుమ్మకొండలో రాతిదూలం పోటీలు

డోన్ టౌన్ : మండలంలోని గుమ్మకొండ గ్రామంలో బంగారుకొండ పాతపాలెం శ్రీఅభయాంజనేయస్వామి శ్రావణ మాసం ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన రాతి దూలం పోటీలను ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. పోటీల్లో తెలంగాణ రాష్ట్రం నాగర్‌కర్నూలు రాయవరం రామచంద్రారెడ్డికి చెందిన వృషభాలు మొదటి స్థానం, నంద్యాల జిల్లా ఎస్ .కొత్తూరు గ్రామానికి చెందిన ఎద్దులు ద్వితీయ స్థానంలో నిలిచాయి. విజేతలైన వృషభాల యజమానులకు వరుసగా రూ.40వేలు, 30వేలు, 20వేలు, 10వేలు, 8వేలు, 5వేలు నగదు బహుమతులను దాతల సహకారంతో అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొమ్మిరెడ్డి దశరథరామిరెడ్డితో పాటు గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

జలదుర్గాన్ని మండలంగా ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కోఆప్షన్ మెంబర్

ప్యాపిలి: జలదుర్గంను మండలంగా ఏర్పాటు చేయాలని మండల కోఆప్షన్ మెంబర్ జలదుర్గం రసూల్ డిమాండ్ చేశారు. ఆదివారం జలదుర్గం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ప్రతిపక్ష నేత హోదాలో జలదుర్గం గ్రామానికి వచ్చిన చంద్రబాబు నాయుడు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే జలదుర్గాన్ని మండలంగా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అలాగే 2024లో డోన్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో సైతం తాము అధికారంలోకి వచ్చిన వెంటనే జలదుర్గంను మండలంగా ప్రకటిస్తామని వాగ్దానం చేశారన్నారు. స్థానిక ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి సైతం తన ఎన్నికల ప్రచారంలో ఇదే హామీ ఇచ్చారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో వీసీ మద్దయ్య, మాసుం, నెల్లూరి నాగరాజు, బషీర్, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు



జనార్దన స్వామి ఆలయం

కోవెలకుంట్ల: మండలంలోని సొదరదిన్నెలో జీర్ణోద్ధరణ గావించిన విష్వక్సేన, ఆంజనేయ, జనార్దన స్వామి ఆలయాల్లో ఈనెల 12 నుంచి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ శిథిలావస్థకు చేరుకున్న పురాతన ఆలయాలను పునర్నిర్మాణం చేపట్టామని, అందులో భాగంగా మొదటి రోజు 12న గోపూజ, గంగానయనము, గణపతి పూజ, యాగశాల ప్రవేశం, 13న యంత్ర అభిషేకం, మూల మంత్రజప అనుష్ఠానములు, జన్దానస్వామి ప్రీతిగా మహా నారాయణ హోమం తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 14న యంత్ర, విగ్రహ, శిఖర, ధ్వజ ప్రతిష్ఠ, ఆవాహిత దేవతా హోమం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

కార్డెన్ సెర్చ్‌లో 13 బైకులు స్వాధీనం



చిగురమానుపేటలో ఓ ఇంటి వద్ద సోదా చేస్తున్న సీఐ, పోలీసులు

డోన్ టౌన్ : పట్టణంలోని చిగురమానుపేట, రైల్వే స్టేషన్‌లలో ఆదివారం పట్టణ పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా ఆధ్వర్యంలో ఎస్ఐలు శరత్‌కుమార్‌రెడ్డి, నరేంద్రకుమార్ పోలీసు సిబ్బందితో అనుమానితుల ఇళ్లు, పరిసరాలు, రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంలపై సోదాలు చేసి అనుమానితులను ప్రశ్నించారు. చిగురమానుపేటలో పలువురి ఇళ్ల వద్ద ఉన్న 13 బైకులకు సరైన ధ్రువీకరణ పత్రాలు, పెండింగ్ చలానాలు ఉండటంతో వాటిని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. అలాగే అదే కాలనీకి చెందిన ఒక వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 5 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మహానందిలో సందడి

– రుద్ర, చండీ, మృత్యుంజయ హోమాలు

మహానంది: మహానంది పుణ్యక్షేత్రంలో శ్రావణమాసం, ఆదివారం భక్తుల సందడి నెలకొంది. పలు ప్రాంతాలకు చెందిన భక్తులు ఆలయానికి చేరుకొని స్థానిక కోనేరులలో పుణ్య స్నానాలు ఆచరించి కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి వారితో పాటు కోదండ రామాలయం, ఆంజనేయ స్వామి, వినాయక నంది, గరుడ నంది ఆలయాలు సందర్శించారు. శ్రావణమాసం కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ఆర్జిత సేవా టికెట్లతో మత్యుంజయ హోమం, చండీ హోమం, రుద్ర హోమం నిర్వహించారు. వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని ఆధ్వర్యంలో హోమాలు జరిగాయి. కామేశ్వరి దేవి అమ్మవారికి భక్తులు సమర్పించిన పట్టు చీరలకు విక్రయ వేలాలు నిర్వహించగా మహిళలు కొనుగోలు చేశారు.

ప్రభుత్వంపై నమ్మకం లేక..

సొంతంగా రోడ్డును బాగుచేసుకున్న యువకులు



రోడ్డుపై గుంతను పూడ్చుతున్న యువకులు

పాణ్యం: రోడ్లను బాగు చేసి వాహనదారులు, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ఉత్తిదేనని తేలిపోయింది. కనీసం రోడ్లపై గుంతలను కూడా పూడ్చకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇంకా వేచి చూసినా ప్రభుత్వం రోడ్లను బాగు చేస్తుందన్న నమ్మకం లేకపోవడంతో తమ్మరాజుపల్లె గ్రామ యువకులు సొంతంగా రోడ్డును బాగు చేసుకునేందుకు నడుంబిగించారు. మండల పరిధిలోని తమ్మరాజుపల్లె- సిమెంట్‌నగర్ గ్రామాల మధ్య ఘాట్ రోడ్డుపై భారీ గుంతలతో అనేక మంది వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారు. అయినా ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోలేదు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ క్రమంలో ఆదివారం తమ్మరాజుపల్లె గ్రామ యువకులు రంగంలోకి దిగి రోడ్డుపై గుంతలను పూడ్చివేశారు. మినీ వాహనంలో తారు, ఇతర మిశ్రమ మెటీరియల్‌ను కలిపి గుంతలను పూడ్చి రోడ్డును బాగు చేశారు. ఇప్పటికైనా అధికారులు పూర్తి స్థాయిలో రోడ్డును బాగు చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

కొత్త ఆవిష్కరణలు చేయాలి

బేతంచెర్ల : మారుతున్న కాలనుగుణంగా సైన్స్‌లో విద్యార్థులు కొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టి దేశ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని సరస్వతి శిశు మందిర్ మాధ్యమిక పాఠశాల అధ్యక్ష, కార్యదర్శులు హుసేన్ రెడ్డి, పుల్లారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని సరస్వతి శిశు మందిర్ మాధ్యమిక పాఠశాలలో ఈనెల 13వ తేదీన కర్నూలు, నంద్యాల జిల్లాల స్థాయిలో 200 మంది విద్యార్థులతో సైన్స్ విజ్ఞాన మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ విజ్ఞాన మేళాకు పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, అధ్యాపకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అన్నదాన కార్యక్రమాలు



అన్నం వడ్డిస్తున్న క్రిష్టియన్ గ్రంథాలయ కమిటీ సభ్యులు

డోన్ టౌన్ : స్థానిక రైల్వే స్టేషన్ ప్రాంతంలోని యాచకులు, పేదలకు పట్టణానికి చెందిన ఆశాలత తన తండ్రి చిట్టెం శామ్యూల్ జ్ఞాపకార్థం డోన్ క్రిస్టియన్ గంథాలయ కమిటీ నిర్వాహకులు ఆదాం, ప్రవీణ్‌కుమార్, వందనం, జాషువా, సుధాకర్‌ల ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అలాగే స్థానిక వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా దేవరకొండ పట్టణానికి చెందిన ఎస్పీ జూలీ తన తల్లి మాణిక్యమ్మ జ్ఞాపకార్థం ప్రార్థన సమయం నిర్వాహకుడు జాన్ ప్రభాకర్ ఆధ్వర్యంలో రోగులకు రొట్టె, పప్పు, గుడ్డు, అరటి పండు అందజేశారు.

గణేష్ ఉత్సవ రాష్ట్ర సమితిలో చోటు

బేతంచెర్ల : రాష్ట్ర గణేష్ ఉత్సవ సమితి నూతన కమిటీలో బేతంచెర్లకు చెందిన బుగ్గన చంద్రమౌళీశ్వర్‌రెడ్డిని ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ఆదివారం విజయవాడలోని లెమన్ ట్రీ ప్రీమియర్ హోటల్‌లో జరిగిన ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి సమావేశంలో నూతన కమిటీ ఎన్నుకున్నట్లు విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యర్రం విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. చంద్రమౌళీశ్వర్‌రెడ్డి ఎన్నిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో జియారత్

కోవెలకుంట్ల: మండలంలోని సొదరదిన్నె గ్రామంలోని పీర్ల చావిళ్లలో జియారత్ వేడుకలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మొహర్రం ముగిసి 40 రోజులు కావడంతో జార్తలను పురస్కరించుకుని బార్ ఇమాం పీరును ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామంతోపాటు కోవెలకుంట్ల, అమడాల, ముదిగేడు, వెలగటూరు, బిజనవేముల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం చావిడి వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ఎస్సార్బీసీలో వ్యక్తి గల్లంతు

పాణ్యం: మండల కేంద్రలోని ఎస్సార్బీసీ ప్రధాన కాల్వలో వ్యక్తి గల్లంతైనట్లు స్థానికులు తెలిపారు. వివరాలు.. నాగపూర్ నుంచి వేలూరుకు కెమికల్ లోడ్‌తో లారీ బయలుదేరగా పాణ్యం సమీపంలో ఎస్సార్బీసీ కాల్వ వద్ద నిలిపి డ్రైవర్ స్నానం చేయడానికి కాల్వలో దిగాడన్నారు. ప్రమాదవశాత్తు కాల్వలో జారి పడి గల్లంతైనట్లు చెప్పారు. సమాచారం అందుకున్న పోలీసులు గాలింపు చర్యలు ప్రారంభించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అ'పూర్వ' సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

బేతంచెర్ల : పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల 2003–04 సంవత్సరం 10వ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 21 సంవత్సరాల తరువాత పాఠశాలకు చేరుకున్న పూర్వ విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను, మిత్రులను కలుసుకొని వారి యోగక్షేమాలను తెలుసుకొని, నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ముందుగా పాఠశాల ఫౌండర్ శేషారెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ హెచ్‌ఎం ఆదినారాయణ, ఉపాధ్యాయులు వెంకటరెడ్డి, వెంకటరావు, సురేంద్రనాథ్‌రెడ్డి, ఆనంద్, అనీఫ్, తిరుపాలు, రత్నమ్మ, శివ కుమారిలను పూర్వ విద్యార్థు లు ఘనంగా సత్కరించారు. సుమారు రూ.3లక్షలు విరాళం రూపంలో సేకరించి మరణించిన, అనారోగ్యంతో బాధపడుతున్న ఏడుగురు స్నేహితుల కుటుంబాలకు అందజేసి అండగా నిలిచారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నరేంద్ర, శ్రీనివాసులు రెడ్డి, సూరి, భగవాన్, రమేష్, రాము, రమణమ్మ, కల్పన, సుహాసిని, పార్వతి, రమాదేవి, మాధవి, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో కాపర్ వైర్ చోరీ ముఠా

కొలిమిగుండ్ల: కొద్ది రోజుల నుంచి రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీలో కాపర్ వైర్ చోరీకి పాల్పడుతున్న మీర్జాపురానికి చెందిన ముఠాను ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీకి సంబంధించి రైల్వే లైన్ ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. హైటెన్షన్ వైర్లను కొద్ది రోజుల నుంచి అపహరిస్తూ సొమ్ము చేసుకునేవాళ్లు. ఈ వైర్ ఖరీదు అయినది కావడంతో ముఠా సభ్యులు తరచూ చోరీకి పాల్పడుతూ ఉన్నారు. ఎట్టకేలకు పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. వారి నుంచి 200 కేజీల వైర్‌తోపాటు వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం పోలీసుల అదుపులో ఎనిమిది మంది ఉన్నట్లు తెలుస్తోంది. మొత్తం 27 మంది రెండు గ్రూపులుగా ఏర్పడి చోరీలకు పాల్పడుతున్నట్లు సమాచారం. పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నారు.

బంగారు పడిగె వితరణ



బంగారు పడిగెను అందిస్తున్న దాతలు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వర స్వామి వారికి దాతలు 10 గ్రాములు బంగారు పడిగెను బహూకరించినట్లు ఈఓ రామక్రిష్ణ ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. బనగానపల్లె పట్టణానికి చెందిన నవీన్‌కుమార్, గీత దంపతులు తమ ఇలవేల్పు స్వామి వారికి 10 గ్రాముల బంగారు పడిగెను బహూకరించారన్నారు. పడిగె విలువ రూ.లక్ష ఉంటుందని తెలిపారు. దాతల కుటుంబసభ్యులకు ఆలయ మర్యాదలతో శేషవస్త్రాలు అందించినట్లు చెప్పారు. ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివపద సంకీర్తనోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఈఓ



శివపద కార్యక్రమంలో భక్తి గీతాలను ఆలపిస్తున్న కళాకారులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానంలో శ్రావణ మాసోత్సవాలలో భాగంగా శివపద సంకీర్తనోత్సవాన్ని నిర్వహించారు. ఆదివారం ఆలయ దక్షిణమాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రవచన కర్త బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మగారు రచించిన 'శివపదం' సంకీర్తనలను ప్రముఖ నేపథ్య గాయకులైన నిహాల్, బృందం ఆలపించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వామి అమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరిపించాలనే భావనతో దేవస్థానం నిత్య కళారాధనగా ప్రతీరోజు సాంస్కతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హరికథ, సంప్రదాయనత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని, గాత్రకచేరి లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మంచి కళాకారులను దేవస్థానం ప్రోత్సహిస్తోందన్నారు. శ్రావణమాసోత్సవాలను పురస్కరించుకుని శివపదం సంకీర్తన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ తదేకదీక్షతో రోజుకొకటి తక్కువ కాకుండా శివార్పణంగా శివకీర్తనలను రచించారన్నారు. ఈ కీర్తనలే 'శివపదం' పేరుతో ప్రసిద్ధి చెందాయన్నారు. నేపథ్యగాయకులు నిహాల్ బృందంలోని జె.వి.ఎస్.ఆర్.ఎస్. ప్రసాద్, సర్వజ్ఞ, కార్తీక, శర్మిష్ఠ, తన్మిక్తి శృతి ఆయా సంకీర్తనలను ఆలపించారు. గణపతయే గణపతయే, శివ శివ మహాలింగ, పార్వతీశంకరులు, నమశ్శివాయ, ఆది ప్రదోషవేళ, పంచామృతాలతో, శివకామసుందరీ, నమో నమో ఉమాపతీ మొదలైన కీర్తనలను గాయనీ గాయకులు ఆలపించారు. కార్యక్రమానికి మృదంగ సహకారాన్ని టి.పి. బాలసుబ్రహ్మణ్యం, వయోలిన్ సహకారాన్ని కౌండిన్య అందించారు.